క్లుప్తంగా

చెట్టును ఢీకొట్టిన బైకు

ఇరువురికి గాయాలు



కర్లపాలెం: ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఇరువురికి కాళ్లు విరిగి తీవ్ర గాయాలైన సంఘటన బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు దుండివారిపాలెం గ్రామానికి చెందిన వారి మస్తాన్‌రెడ్డి, దొంతిరెడ్డి శివారెడ్డి బైక్‌పై ఖాజీపాలెం వెళ్లి తిరిగి వస్తుండగా దమ్మనవారిపాలెం వచ్చేసరికి బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన తాడి చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురికి ఎడమ కాళ్లు విరగటంతో పాటు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. వీరిని కుటుంబ సభ్యులు గుంటూరులోని ఓ వైద్యశాలకు తరలించారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు



కర్లపాలెం: ఉపాధ్యాయులు ఐకమత్యంగా ఉండటం వలన సమస్యలు పరిష్కరించుకోవచ్చునని బాపట్ల జిల్లా యూటీఎఫ్ శాఖ కోశాధికారి ఎం.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం ఉపాధ్యాయులు యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. యూటీఎఫ్ శాఖ కర్లపాలెం మండల అధ్యక్షుడు బీవీ.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వైవి.నారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించటంలో యూటీఎఫ్ ముందంజలో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు పోలీస్‌రావు, ప్రభాకర్, డేవిడ్ గణపతిరెడ్డి, శ్రీనివాసరావు, రాఘవేంద్ర, బాపూజీరెడ్డి, ఉషాకిరణ్ తదితరులు ఉన్నారు.

మండలంలో 98 శాతం పింఛన్లు పంపిణీ

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలో 12 సచివాలయాల పరిధిలో 98.61 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో జేబీవీ మల్లికార్జునరావు మంగళవారం తెలిపారు. తొలి రోజే దాదాపు పింఛన్ల పంపిణీ పూర్తయిందని రెండో రోజు మిగిలి ఉన్నవారికి పింఛన్లు అందచేసినట్లు చెప్పారు. యాప్ పని చేసినంత వరకు పింఛన్లు పంపిణీ చేస్తామని వివరించారు.

పింఛన్ల పంపిణీలో వేమూరు ప్రథమం

వేమూరు: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీలో వేమూరు మండలం ప్రథమ స్థానం సాధించడం జరిగిందని ఎంపీడీవో శేషగిరి రావు తెలిపారు. వేమూరు మండలంలో సోమ, మంగళవారాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో పింఛనుదారులు మొత్తం 7,370 మంది ఉండగా 7,329 మందికి పంపిణీ చేయడం జరిగిందన్నారు. 31 మంది మృతి చెందారన్నారు. పది మంది ఇళ్లలో లేరన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో బాపట్ల జిల్లా వేమూరు మండలం ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పారు. మండలంలో 99.47 శాతం పంపిణీ చేపట్టడం జరిగిందన్నారు.

సమాజానికి వైద్యులు, సీఏలు ఎంతో కీలకం



గుంటూరు ఎడ్యుకేషన్: సమాజానికి వైద్యులు, సీఏలు ఎంతో కీలకమని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవోపా కార్యాలయంలో మంగళవారం పలువురు వైద్యులు, చార్టర్డ్ అకౌంటెంట్లను సత్కరించారు. ఈసందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రపంచంలోని ప్రతి మనిషికి అవసరమైన రెండు ముఖ్యమైనవి ఆరోగ్యం – సంపద అని, మన ఆరోగ్యాన్ని సంరక్షించే వైద్యులతో పాటు మన సంపదను ఏలా ఉపయోగించేకోవాలనే సలహాలను ఇచ్చే సీఏలను సన్మానించుకోవడం మన అదృష్టమన్నారు. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఈ వైద్య వృత్తిని అంకితభావంతో నిర్వహించాలని అన్నారు. ఈసందర్భంగా 18 మంది వైద్యులతో పాటు ఆరుగురు సీఏలను సత్కరించారు. కార్యక్రమంలో శంకర నేత్రాలయ వైద్యుడు పాట్టి సుధాకర్, అవోపా రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు, నగర అధ్యక్షుడు కేవీ బ్రహ్మం, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్, ప్రోగ్రాం కన్వీనర్లు డాక్టర్ రామ్‌కుమార్, దేవరశెట్టి అమర్ పాల్గొన్నారు.

డ్రైనేజీలు అస్తవ్యస్తం.. దోమల స్వైరవిహారం

- పూడికతీత లేక ఎక్కడి వ్యర్థాలు అక్కడే
- మురుగు నీరు ప్రవహించక హెచ్చు మీరుతున్న దోమల తాకిడి
- పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో ప్రబలుతున్న అంటు వ్యాధులు
- పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని స్థానికుల వినతి



భట్టిప్రోలులో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక నిలిచిన మురుగు నీరు

భట్టిప్రోలు: చినుకు పడితే చాలు మండలంలో పరిస్థితి అధ్వానంగా మారుతుంది. మురుగు ఇళ్ల మధ్య ఖాళీ ప్రదేశాల్లో ఎక్కువగా నిలిచి దోమల వృద్ధికి కారణమవుతున్నాయి. పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. భట్టిప్రోలు గ్రామ పంచాయతీ పరిధిలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయి. పగలు రాత్రి తేడా లేకుండా దోమలు ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. డ్రైనేజీలో మురుగు నీరు ముందుకు పారకపోవడంతో దోమలకు నిలయంగా మారుతోంది. ఈ దోమల ద్వారా మలేరియా, బోధకాలు, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు, ఇతర జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. పంచాయతీ పరిధిలో ఉన్న ఏ డ్రైనేజీలో చూసినా లార్వా కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. దీంతో దోమల ఉధృతికి అడ్డూ అదుపు లేకుండా పోయింది. ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారాన్ని వేయడం వల్ల రోగాల బారిన పడుతున్నారు. పంచాయతీ సిబ్బంది డ్రైనేజీలలో పూడిక తీస్తున్నప్పటికీ ఆ వ్యర్థాలను తొలగించకపోవడంతో కోళ్లు, పందులు వాటిని చిందర వందర చేయడంతో మరలా అవి డ్రైనేజీలోకి చేరుతున్నాయి. చెత్తా చెదారాన్ని స్థానికులు మురుగు కాలువల్లో వేయటం వల్ల మురుగు నీరు పారుదలకు అడ్డంకిగా మారింది. పంచాయతీ పరిధిలో పక్కా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసినప్పటికీ అవి ఎగుడుదిగుడుగా నిర్మించడం వల్ల మురుగు నీరు ముందుకు కదలడం లేదు. భట్టిప్రోలు కూరగాయల మార్కెట్ వెనుక డ్రైనేజీ వద్ద అడ్డుగా మురుగు నీటిని నిలుపు చేశారు. ఇలా చేయకపోతే మురుగు నీరు మార్కెట్ వైపుకు కాకుండా విశలేశ్వర్‌నగర్ వైపు ఎగదన్నే అవకాశం ఉంది. ఈ సమస్య డ్రైనేజీ నిర్మించిన నాటి నుంచి ఉన్నప్పటికీ నేటి వరకు దీని పరిష్కారానికి పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోలేదు. ఇదే పరిస్థితి పంచాయతీ పరిధిలోని అన్ని వార్డుల లోనూ నెలకొంది. దోమే కదా అని ఊరుకుంటే ప్రాణాంతక జబ్బుల బారిన పడే ప్రమాదం ఉందని వైద్యాధికారులు అంటున్నారు. ఇలాంటి తరుణంలో దోమల వల్ల కలిగే అనర్థాలు, ప్రబలే వ్యాధులు, వాటి లక్షణాలను గూర్చి తెలుసుకోవాలని వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యురాలు సీహెచ్ రామలక్ష్మి సూచిస్తున్నారు.

దోమల నియంత్రణకు చర్యలు

- నీరు నిల్వ లేకుండా చూడాలి.
- మురుగు కాల్వల్లో నీరు సక్రమంగా పారేలా చేయాలి.
- పరిసర ప్రాంతాల్లో కంప చెట్లు, పిచ్చిమొక్కలు తొలగించుకోవాలి.
- ఇళ్ల మధ్య గుంతల్లో నిలిచిన నీరు ఎక్కువ కాలం నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- అన్ని రకాల నీటి నిల్వల్లో వారానికి ఒకసారి దోమల నియంత్రణ మందు వేయాలి.
- దోమలు కుట్టకుండా దోమ తెరలు ఇతరత్రా విధానాలు అవలంబించాలి.

అప్రమత్తతతో వ్యాధులు దూరం



వ్యాధి చిన్నదైనా వెంటనే వైద్యులను సంప్రదించాలి. వైద్యుల పర్యవేక్షణలోనే మందులు వాడాలి. ఒక వేళ జ్వరం తగ్గకపోతే డాక్టర్ సూచన మేరకు వైద్య పరీక్షలు చేయించి వ్యాధిని బట్టి చికిత్స తీసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు వృద్ధి చెందవు. పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

–సీహెచ్ రామలక్ష్మి, వైద్యురాలు, వెల్లటూరు పీహెచ్‌సీ, భట్టిప్రోలు.

బంద్‌ను విజయవంతం చేయండి

ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్ కుమార్



భట్టిప్రోలులో బంద్‌కు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు కార్యకర్తలు

భట్టిప్రోలు: నీట్ పరీక్షను మరలా నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని, మెడికల్ ఎంట్రన్స్ పరీక్షను రాష్ట్ర స్థాయిలో నిర్వహించాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) గురువారం విద్యా సంస్థల బంద్‌కు పిలుపు నిచ్చినట్లు బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు పి. మనోజ్ కుమార్ తెలిపారు. మంగళవారం భట్టిప్రోలులోని గాయత్రి అకాడమిలో బంద్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. మనోజ్ కుమార్ మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా నీట్ పరీక్షలో ఈ ఏడాది అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఈ పరీక్షలు నిర్వహించే ఎన్‌టీఏను రద్దు చేయాలని బాధిత విద్యార్థులు కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌కు మొర పెట్టుకున్నా స్పందన లేదన్నారు. ఈ పరీక్ష మళ్లీ నిర్వహిస్తామని నేటి వరకు ప్రకటన ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఐక్య విద్యార్థి సంఘాల పిలుపు మేరకు గురువారం లెఫ్ట్, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలను కలుపుకుని ఎస్ఎఫ్ఐ దేశవ్యాప్తంగా ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. విద్యార్థులు బంద్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మొహుద్దీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాపట్లలో హేతువాద మహాసభలు

- 13,14 తేదీల్లో నిర్వహణ
- హేతువాద సంఘం అధ్యక్షుడు కరణం రవీంద్రబాబు



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హేతువాద సంఘం నాయకులు

బాపట్ల: బాపట్ల పట్టణంలోని ఎన్జీవో హోంలో ఈ నెల 13,14 తేదీల్లో భారత హేతువాద సంఘం 93వ వార్షిక మహాసభలు, ఏపీ హేతువాద సంఘం 23వ ద్వైవార్షిక మహా సభలు జరుగుతున్నాయని హేతువాద సంఘం అధ్యక్షులు కరణం రవీంద్రబాబు తెలిపారు. మంగళవారం ఎన్జీవో హోంలో జరిగిన సమావేశంలో మహా సభల కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. రవీంద్రబాబు మాట్లాడుతూ మహాసభలకు కేరళ, గుజరాత్ కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతారన్నారు. బాపట్లలో రెండు రోజుల పాటు హేతువాద, మానవవాద అధ్యయన తరగతులు జరుగుతాయన్నారు. నిత్య జీవితంలో విశ్వతత్వం, జీవతత్వం, విశ్వ పరిణామం, హేతువాద మానవవాద అంశాల మీద ఉపన్యాసాలు, సమాధానం ఉంటాయన్నారు. ఈ మహా సభల్లో కేరళ నుంచి శ్రీని పట్టతానం, డాక్టర్ పి రాఘవన్, బాబు పల్లి కరా, సదానందం, తెలంగాణ నుంచి అడియాల శంకర్, కె శ్రీనివాసాచారి, డాక్టర్ గుమ్మ వీరన్న, ఆంధ్రప్రదేశ్ నుంచి కుర్ర హనుమంతరావు, మేడూరి సత్యనారాయణ, షేక్ బాబు, సింహాద్రి ఎలమందారెడ్డి, రేగేటి వెంకటేశ్వరరావు, పర్వతయ్య చంద్రశేఖర్ ప్రసంగిస్తారన్నారు.

నేటి నుంచి రక్షణ సువార్త ఉజ్జీవ సభలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం రాచూరు గ్రామంలోని ఆంధ్ర సౌవార్తిక లూథరన్ సంఘం, క్రీస్తు లూథరన్ దేవాలయం ఆధ్వర్యంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు రక్షణ సువార్త ఉజ్జీవ సభలు నిర్వహించనున్నట్లు సీజీఎస్ఐ ఎక్స్ వైస్ ప్రెసిడెంట్, సంఘ కాపరి రెవరెండ్ ఎల్లమాటి ఆదాము మంగళవారం తెలిపారు. ప్రసంగీకులుగా రెవరెండ్ డాక్టర్ దేగల రత్నం, రెవరెండ్ వై ఎజ్రాపాల్, రెవరెండ్ డాక్టర్ కె.బుజ్జిబాబు, పాస్టర్ ఎ.రమేష్‌లు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. స్థానిక క్వయిర్‌చే మధుర గీతాలు ఆలపించ బడతాయని తెలిపారు. సంఘ పెద్దలు, యూత్, స్త్రీల సమాజం, సండే స్కూల్ చిన్నారులు, సంఘస్థుల సహకారంతో ఈ సభలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

వేమూరులో ఉపాధి పథకం ప్రజావేదిక



వేమూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతి లేకుండా ఫీల్డ్ అసిస్టెంట్‌లు పనులు చేయించడం జరిగిందని బాపట్ల జిల్లా డ్వామా ప్రాజెక్ట్ అధికారి రాజేష్ అన్నారు. వేమూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఉపాధి పథకం సోషల్ ఆడిట్ ప్రజా వేదిక నిర్వహించారు. 17వ విడత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం 2023–24 ఆర్థిక సంవత్సరం పనులపై సోషల్ ఆడిట్ బృందాలు గ్రామాల్లో సందర్శించి తనిఖీ చేశారన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు పని ప్రాంతంలో తాగునీటి సదుపాయాలు కల్పించాలని ఆయన ఆదేశించారు. కూలీలకు వేతనాలు సక్రమంగా అందించడం జరిగిందన్నారు. 2024–2025 ఆర్థిక సంవత్సరం పనులు గుర్తించాలని సూచించారు. ఉపాధి కూలీలకు పనులు వెంటనే కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ సువార్త, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ వెంకటేష్ నాయక్, ఏపీవో సత్య కృష్ణ, డీఆర్‌పీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

గుంటూరుఈస్ట్: మున్సిపల్ కార్పొరేషన్ స్థలంలో ఇద్దరు అక్రమంగా ప్రవేశించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కృష్ణనగర్ 2వలైనులోని మున్సిపల్ కార్పొరేషన్ స్థలం ప్రహరీని చల్లా శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ పగులగొట్టారు. స్థలంలోకి ప్రవేశించి చెట్లను నరికారు. ఘటనపై మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ వార్డు ప్లానింగ్ సెక్రటరీ శివసాయితేజ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరం



క్లస్టర్ స్థాయి విజేతలతో ప్రిన్సిపల్ హనీమెహత

గుంటూరు రూరల్: విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమని నల్లపాడు కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపల్ హనీమెహత తెలిపారు. గత రెండు రోజులుగా నల్లపాడు గ్రామంలోని పీఎం కేంద్రియ విద్యాలయంలో జరుగుతున్న హైదరాబాద్ రీజియన్ కేంద్రియ విద్యాలయాల బాలికల అండర్ 17 కబడ్డీ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ క్రీడల వల్ల విద్యార్థుల్లో పోటీ తత్వం పెరిగి విద్యలోనూ రాణిస్తారన్నారు. హైదరాబాద్ రీజియన్ ఆదేశాల మేరకు రెండు రోజులుగా అండర్ 17 బాలికల క్లస్టర్ స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించటం జరిగిందన్నారు. పోటీలలో 9 కేవీల నుంచి 9 జట్లు, సుమారు 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఏపీ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఆరుగురు అధికారుల బృందం మ్యాచ్‌లను పర్యవేక్షణ చేశారన్నారు. కబడ్డీలో బాలికల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. క్లస్టర్ స్థాయి క్రీడల్లో విజేతలు ఈనెల 6, 7వ తేదీలలో నల్లపాడు కేంద్రియ విద్యాలయంలో జరిగే గుంటూరు రీజియన్ స్థాయి క్రీడల్లో పాల్గొంటారన్నారు. అనంతరం పోటా పోటీగా సాగిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.లక్ష్మిప్రసన్న, ఎస్.ఆనంద్, సునీల, పీఈటీలు అంజలి, ఆర్ చాంగ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు, యూనిఫాం సకాలంలో అందించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న శైలజ

చేబ్రోలు: విద్యార్థులందరికీ సకాలంలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంను అందజేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ అన్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఆకస్మిక తనిఖీ చేశారు. చేబ్రోలు మండలంలోని స్టూడెంట్ కిట్స్ పంపిణీ, పీఎం పోషన్‌లను పరిశీలించారు. విద్యార్థులకు స్టూడెంట్ కిట్ పంపిణీ, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌ల పంపిణీ గురించి వివరాలు తెలుసుకున్నారు. అదనంగా అవసరమైతే జిల్లా స్థాయి డిపో నుంచి తీసుకొని వివిధ పాఠశాలల నుంచి నూతనంగా చేరిన విద్యార్థులకు కూడా వెంటనే అందజేయాలని తెలిపారు. వేజండ్ల జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులకు తెలుగు చదవడం మరియు వ్రాయడం గురించి బాగా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నారాకోడూరు జెడ్పీ హైస్కూల్‌లో పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత కోసం జాగ్రత్త తీసుకోవాలని సీజనల్ వ్యాధులు పట్ల తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యలో వెనుకబడిన వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎంఈవో రాయల సుబ్బారావు, హెచ్‌ఎం విజయశ్రీ, ఏం ఏడుకొండలు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనం నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలి



పట్నంబజారు: డ్రైవర్లు బస్సు నడిపే సమయంలో తన చేతుల్లో ఎన్నో కుటుంబాలు ఆధారపడి ఉన్నాయన్న విషయాన్ని గుర్తించి డ్రైవింగ్ చేయాలని ఏపీఎస్ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎం.రవికాంత్ చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్‌లోని కంట్రోల్ రూము వద్ద మంగళవారం గేట్‌మీటింగ్ నిర్వహించారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణ మనందరి బాధ్యత అనే నినాదంతో ఏర్పాటు చేసిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆర్ఎం రవికాంత్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో డ్రైవర్లు ఎంతో అప్రమత్తంగా వాహనాలు నడపాలని సూచించారు. ప్రతి ఒక్కరూ డీజిల్ ఆదా చేసి తద్వారా సంస్థ ఆర్థిక స్థితి మెరుగు పరిచేందుకు పాటుపడాలని సూచించారు. అదే విధంగా సిబ్బంది ప్రతి ఒక్కరూ ద్విచక్రవాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని సూచించారు.

కనుల పండువగా పోలేరమ్మ తిరునాళ్ల

- ఆలయ ప్రాంగణంలో ఆకర్షణగా నిలిచిన విద్యుత్ ప్రభలు
- పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



భక్తులకు దర్శనమిస్తున్న పోలేరమ్మ

బాపట్లటౌన్: మండలంలోని కనకాద్రినగర్ గ్రామంలో వెంచేసి యున్న పోలేరమ్మ అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం తిరునాళ్ల మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తిరునాళ్లను పురస్కరించుకొని చుట్టు ప్రక్కల గ్రామాల్లోని భక్తులు ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లపై అమ్మవారి ప్రభలను ఏర్పాటు చేసుకొని కనక తప్పెట్లు, మేళతాళాల నడుమ ఆలయానికి చేరుకున్నారు. తొలుత ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. పశు పోషకులు తమ పశు సంపదను చల్లగా చూడు తల్లీ అంటూ ఆలయం చుట్టూ ప్రదిక్షణలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. తిరునాళ్లను పురస్కరించుకొని విద్యుత్ బల్బులతో ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయ ప్రాంగణంలో కళాకారులు వేసిన చింతామణి నాటకం, ఆదివాసుల డ్యాన్స్, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

3 వేల మందికి అన్నదానం

తిరునాళ్లను పురస్కరించుకొని ముత్తాయపాలెం గ్రామానికి చెందిన పమిడిబోయిన వెంకటేశ్వర్లు మంగళవారం భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 12 ఏళ్లుగా అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని దానిలో భాగంగానే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.



అమ్మవారి పూజల్లో మహిళలు



భక్తులకు అన్నదానం

రాయితీ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి



రైతులకు వరి విత్తనాలు పంపిణీ

పిట్టలవానిపాలెం: ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై అందించే వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సత్యానంద్ తెలిపారు. మండలంలోని మంతెనవారిపాలెం, ఖాజీపాలెం రైతు సేవా కేంద్రాల వద్ద రాయితీ వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీ వరి విత్తనాలకు రూ.5 లు సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. బీపీటీ 5204, ఎంటీయూ 1224, ఎంటీయూ 1061 రకం వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కేజీ ధర రూ.41.80లు కాగా సబ్సిడీ రూ.5లు పోనూ రూ.36.80లు చెల్లించాలని తెలిపారు. రైతులు 2024–25 సంవత్సరానికి సంబంధించి పంట సాగు దారుల హక్కు పత్రాలు రెవెన్యూ శాఖ నుంచి పొందాలని సూచించారు. ఈ పత్రాలతో ఈ–క్రాపు నమోదు చేయించుకోవాలని తెలిపారు. పంట ఉత్పతుల విక్రయాల సమయంలో సాగు హక్కు పత్రాలు ఉపయోగపడతాయని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటపతిరాజు, మంతెన కృష్ణమూర్తి రాజు, గోకరాజు వర్మరాజు, మంతెన నరసింహమూర్తి రాజు, దండు శ్రీనివాసరాజు, ఏఈఓలు, వీఏఏలు ఉన్నారు.

వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

రేపల్లె రూరల్: ప్రతి ఒక్కరూ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు అబ్దుల్ రెహమాన్ అన్నారు. పట్టణంలోని ఓల్డ్‌టౌన్ అర్బన్ హెల్త్ సెంటరులో మంగళవారం నిర్వహించిన డెంగీ నివారణ మాసోత్సవ ర్యాలీని ఆయన ప్రారంభించి అనంతరం మాట్లాడారు. ఈడెస్ రకానికి చెందిన దోమల వలన కలిగే ఈ వ్యాధితో జ్వరం, తలనొప్పి, వాంతులు, కండరాలు, కీళ్ల నొప్పులు, చర్మపు దద్దుర్లు వంటి అనేక లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ లక్షణాలు కలిగిన వారు వైద్యుల సహాయంతో త్వరిత గతిన చికిత్స పొంది వ్యాధి నుంచి ఉపశమనం పొందాలన్నారు. దోమల నిర్మూలనతో వ్యాధిని దూరంగా ఉంచవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పొడిగా ఉంచుకోవాలని, వారంలో ఒకరోజు డ్రైడే పాటించాలని సూచించారు. నీటి నిల్వలు, తేమ వాతావరణం లేకుండా చూసుకోవాలని చెప్పారు. డెంగీ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ దామెర్ల శ్రీలక్ష్మి, సూపర్‌వైజర్ ఎం.ఎల్లయ్య, ఆరోగ్య సిబ్బంది శిరీష, తిరుపతమ్మ, నరేంద్ర, రామాజీ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే రక్షణసైన్యం ధ్యేయం

రక్షణ సైన్యం సంఘ కాపరి మేజర్ యోబు



రక్షణ సైన్యం జెండా ఆవిష్కరిస్తున్న సంఘ కాపరి మేజర్ యోబు

బాపట్ల టౌన్: పేదల అభ్యున్నతి కోసం ఆవిర్భవించినదే రక్షణ సైన్యమని రక్షణ సైన్యం సంఘ కాపరి మేజర్ యోబు తెలిపారు. పట్టణంలోని విద్యానగర్‌లో ఉన్న రక్షణ సైన్యం ప్రార్థనా మందిరం ప్రాంగణంలో మంగళవారం రక్షణసైన్యం 159 వ సంస్థాగత దినోత్సవ వేడుకలను నిర్వహించారు. తొలుత జెండాను ఆవిష్కరించారు. సంఘ కాపరి యోబు మాట్లాడుతూ లండన్‌లో 1865 సంవత్సరంలో స్థాపించిన రక్షణ సైన్యం విద్య, వైద్య, సాంఘిక, సువార్త సేవలు అందించటంలో ముందుందని పేర్కొన్నారు. 159వ సంవత్సరంలో అడుగిడిన విలియంబూత్ ఎన్నో సేవలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికీ 134 దేశాల్లో రక్షణ సైన్యం సేవలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు మణిభూషణ్, కె.వై.ధనకుమార్, మేజర్ డి జ్యోతి, తుమాటి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కారు ప్రమాదంలో గోవు మృతి

పట్నంబజారు: మద్యం మత్తులో అతివేగంగా కారు నడిపి గోవు మృతికి కారణమై, ద్విచక్రవాహనాలు ధ్వంసమైన ఘటనలో వ్యక్తిపై కేసు నమోదైంది. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు.. భావోజీనగర్‌కు చెందిన షేక్ అర్షద్‌అలి సోమవారం అర్ధరాత్రి సమయంలో పూటుగా మద్యం తాగి తన నివాసానికి కారులో వెళుతున్నాడు. అతివేగంగా వెళ్తూ రోడ్డుపై నిద్రిస్తున్న గోవును ఢీకొట్టాడు. గోవు ఘటనా స్థలంలోనే మృతి చెందింది. అనంతరం అదుపు తప్పిన కారు పక్కనే ఉన్న ద్విచక్ర వాహనాలను ఢీకొంటూ గోడను ఢీకొట్టాడు. దీంతో రెండు బైక్‌లు ధ్వంసం అయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో మూడు ఎయిర్‌బెలూన్లు ఓపెన్ అయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకుని, గోమాతకు అంత్యక్రియలు నిర్వహించారు.